క్లుప్తంగా

పాఠశాల ప్రహరీ ధ్వంసం

గుర్తు తెలియని వాహనం ఢీ



దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ ధ్వంసమైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రాత్రి సమయాలలో తొర్రూరు మండలం చీకటయపాలెం గ్రామంలో ఉన్న ఆకేరు వాగు నుంచి రాత్రి అక్రమంగా ఇసుక తరలించే క్రమంలో ఓ ట్రాక్టరు అదుపు తప్పి గోడను ఢీకొనడంతో, గోడ కూలిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు అడ్డు, అదుపు లేకుండా నడవడంతో గ్రామంలో రోడ్లు, తదితర ప్రభుత్వ ఆస్తులు దెబ్బతింటున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయం పాఠశాల హెచ్.ఎం.శ్రీదేవిని వివరణ కోరగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డుపై గుంతలు..

ప్రయాణికులకు తప్పని తిప్పలు



డోర్నకల్: యాదవనగర్ నుంచి బుద్దారం తండా మీదుగా వెళ్లే గార్ల రోడ్డు ధ్వంసమై వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలి



కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ, మణుగూర్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలని కేసముద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతూ.. సోమవారం సికింద్రాబాద్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు రావుల మురళీ, బండారు దయాకర్, చిదురాల వసంతరావు, బనిషెట్టి వెంకటేష్, మూల భూలోక్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారికి వీల్‌చైర్ అందజేత



చిన్నగూడూరు: పుట్టుకతో నడవలేని స్థితిలో ఉన్న చిన్నారికి సోషల్ మీడియా సభ్యులు సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని మేఘ్యాతండా జీపీ పరిధిలోని చిన్నతేజ తండాకు చెందిన బానోత్ భాస్కర్ కూతురు పుట్టుకతో దివ్యాంగురాలు. చిన్నతనంలోనే నడకకు దూరమైన చిన్నారి ఎదుర్కొంటున్న సమస్యలను బాదావత్ సురేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గ్రూప్ సభ్యుల ద్వారా ఆ చిన్నారికి రూ. 5వేలు విలువైన వీల్ చైర్‌ను అందజేశారు.

రేపు కౌన్సెలింగ్

కురవి: 2024–25విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌తో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 22న కురవిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మార్త సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఆన్‌లైన్ చేసుకున్న, చేసుకోని విద్యార్థులు హాజరుకావచ్చని తెలిపారు. విద్యార్థులు ఎస్సెస్సీ మెమో, స్టడీ, టీసీ, కులం, ఆధాయం, నివాసం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు. కౌన్సెలింగ్ ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని ఆయన వివరించారు.

మైకే కాపలాదారు..



డోర్నకల్: డోర్నకల్ శివారు బుద్దారంతండాకు చెందిన రైతు నంద్యానాయక్ తన మామిడి తోటలో చిన్న చార్జింగ్ మైకును కాపలాదారుగా ఏర్పాటు చేశాడు. మైకులోని చిప్‌లో కుక్కల అరుపులు, మనుషుల గొంతుతో అరుపులు రికార్డు చేసి చెట్టుకు అమర్చాడు. మైకు ఏర్పాటుతో కాపలాదారు ఖర్చు తప్పిందని నంద్యానాయక్ తెలిపాడు.

ఆలయానికి మరమ్మతులు ఎప్పుడో?

- గత వర్షాకాలంలో కోతకు గురైన ఆలయం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- నిలిచిన వారాంతపు పూజలు



ఆకేరువాగులో నీట మునిగిన ఆలయం (ఫైల్)



ప్రస్తుతం ఇలా..

చిన్నగూడూరు: కోరుకున్న వారికి కొంగు బంగారంగా నిలిచే మండలకేంద్రం శివారులోని ఆకేరు ఒడ్డున వెలసిన గంగమ్మ, పెద్దమ్మ తల్లుల ఆలయాలకు వారాంతపు పూజలు నిలిచిపోయాయి. చిన్నగూడూరు, మహబూబాబాద్, నర్సింహులపేట, మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ప్రతి ఆదివారం పూజలు నిర్వహించేవారు. కోరుకున్న వారికి కొంగు బంగారంగా నిలిచే గంగమ్మ తల్లిని పూజిస్తే అంత శుభమే జరుగుతుందని ఈ ప్రాంతాలవారి ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంత రైతులు సాగుపంటలు మొదలు పెట్టాలన్నా.. ఇళ్లలో శుభకార్యం చేయాలన్నా.. ముందు గంగమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేసిన తర్వాతే మొదలు పెడతారు. ఇలాంటి పురాతన చరిత్ర కలిగిన ఆలయానికి గత వర్షకాలంలో వచ్చిన ఆకేరు వరద ఉధృతికి ఆలయం కొంత భాగం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు ఆలయం వద్దకు వెళ్లేందుకు గుడి పరిసరాలు కోతకు గురై భక్తులకు ఇబ్బందిగా మారింది. దీంతో వారాంతపు పూజలకు అంతరాయం ఏర్పడి, భక్తుల రద్దీ తగ్గిపోయింది. ఆలయ నిర్మాణానికి చొరవ చూపి పూజలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



వారాంతపు పూజలతో భక్తులు రద్దీగా ఉండే ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తుల రద్దీ తగ్గిపోయింది. గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– చిత్తారి వీరన్న, చిన్నగూడూరు

ప్రజల పక్షాన పోరాటం చేస్తా..

- ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



తొర్రూరు: మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మహబూబాబాద్ రూరల్: గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో కాలం వెళ్ల దీస్తుందని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమేందర్ రెడ్డి మహబూబాబాద్ బార్ అసోసియేషన్ హాలులో సోమవారం న్యాయవాదులను కలసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు నిర్వహించిన ఉద్యోగ నియామకాలను తమ ప్రభుత్వమే నింపిందని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెబుతుందన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భట్టు కృష్ణ, న్యాయవాదులు మేక సురేష్ రెడ్డి, రవికుమార్, గిరి, సత్యనారాయణ, సిద్ధార్థ, మోహన్ నాయక్, రమేష్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

గార్ల: గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం గార్లలో సెన్సార్ బోర్డు సభ్యురాలు హైమారెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్‌జైన్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమణి, సుమలత, మండల అధ్యక్షుడు శ్రీను, జశ్వంత్ ఠాగూర్, పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం

దంతాలపల్లి: పట్టబభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో , ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విజయం ఖాయమని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ కొడాపురం జగన్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, జెడ్పీటీసీ భుక్య సంగీత, నాయకులు సహదేవ్, చీకటి చిన్న మహేష్, నరేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే శక్తి సీఎంకు లేదు

తొర్రూరు: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే శక్తి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోరుతూ సోమవారం డివిజన్ కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, లేగా రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పల్లె కుమార్, రాములు, మహేందర్, రాజశేఖర్, కోటేశ్వర్, కుమార్, సాయిని ఝాన్సీ పాల్గొన్నారు.

బయ్యారం: ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

‘ప్రైవేట్’ ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న స్యూర్యప్రకాష్

మహబూబాబాద్ అర్బన్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల్లో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గుగులోత్ సూర్య ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సూర్యప్రకాష్ హాజరై మాట్లాడారు. జిల్లాలోని అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజులు హద్దు లేకుండా మితిమీరి వసూలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, తరుణ్, పరమేష్, ప్రవీణ్, దినేష్, కార్తీక్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండా, ఆగపేట్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ వివేక్‌రామ్ సోమవారం పరిశీలించారు. ఈమాట్లాడుతూ.. మండలంలోని 13 పాఠశాలలకు ఇప్పటి వరకు ఏడు పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన ఆరు పాఠశాలలో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాలల సీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గూడూరు పాఠశాలలో..

గూడూరు: అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఎంఈఓ శ్రీదేవి హెచ్‌ఎంలకు సూచించారు. మండలంలోని భూపతిపేట, బోడ భక్కతండా, వెంగంపేట, కోబల్‌తండాలలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సోమవారం ఎంఈఓ తనిఖీ చేశారు.

పనులు పూర్తి చేయాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో అభివృద్ధి పనులన్నిటిని వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎండి సిలార్ సాహెబ్, మండల నోడల్ అధికారి మహంకాళి బుచ్చయ్య సూచించారు. సోమవారం మండలంలోని అమర్‌సింగ్, కర్రెబిక్యా, కేమ్లా తండాలు, కర్కాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

‘అధికారుల కనుసన్నల్లో ఇసుక దందా’



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి, వెంకట్‌రెడ్డి

నెల్లికుదురు: మండలంలోని ఆఖేరు వాగు పరిసర ప్రాంతాల గ్రామాల పరిధిలోంచి అధికారుల కనుసన్నల్లోనే అక్రమ ఇసుక దందా కొనసాగుతుందని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి అన్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అక్రమంగా జరుగుతున్న ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులే చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కార్యక్రమంలో రమేష్, బోజ్యానాయక్, అనిల్, శ్రీనివాస్, మాన్‌సింగ్ బీముడు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగాలు



కురవి: ప్రచారం చేస్తున్న నాయకులు

కురవి: కాంగ్రెస్ పార్టీతోనే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోసం ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు బాలగాని శ్రీనివాస్, అవిరెమోహన్‌రావు, తరాల వీరన్న, బాదె వీరభద్రం, చిన్నం గణేష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

నెహ్రూసెంటర్: తీన్మార్ మల్లను గెలిపించాలని బీసీ రాజ్యాధికార సమితి మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముంజాల రాజేందర్‌గౌడ్ సోమవారం పిలుపునిచ్చారు.

ఆరు నెలలుగా అందని వేతనాలు



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు: గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందించాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. ఆరుమాసాలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయలేదని, దీంతో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పంచాయతీల్లో పని చేసే వారంతా నిరుపేదలేనని, వారి వేతనాలు పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. వారికి కనీస వేతనం రూ.26వేలు అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాడ్య బీకు, మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, నాయకులు ప్రమోద్, రాజేందర్, యాకన్న, దేవేందర్‌లు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో అనేక లాభాలు



దుక్కులను పరిశీలిస్తున్న ఏఓ వీరసింగ్

మరిపెడ రూరల్: లోతైన దుక్కులు దున్నడంతోనే పంటలకు అనేక లాభాలు సమకూరుతాయని మండలం వ్యవసాయ అధికారి వీరసింగ్ అన్నారు. మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని వాల్యతండాలో గిరిజన రైతులు రబీ సాగుకు సిద్ధం చేస్తున్న దుక్కులను ఈఓ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న తొలకరి వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని దుక్కులు దున్నడం, వ్యవసాయ క్షేత్రాల్లోని చెత్త చెదారం తొలగించే పనులు చేస్తున్నారన్నారు. లోతైన దుక్కుల వలన అనేక లాభాలు ఆర్జించవచ్చునన్నారు. క్రిమి కీటకాల గ్రుడ్లు, వాటి లార్వా దశలో ఉన్న పురుగులు చనిపోతాయన్నారు. లోతైన దుక్కుల వలన భూమిలో తేమ శాతం పెరుగుతుందన్నారు. అనేక విషయాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.

ఘనంగా జెండా పండుగ



జెండా పండుగ నిర్వహిస్తున్న తండావాసులు

కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్‌తండా జీపీలో గుగులోతు వంశీయుల ఆధ్వర్యంలో తమ పూర్వీకులను స్మరిస్తూ.. జెండా పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఎర్రజెండాలను ఏర్పాటు చేసి, ప్రాంగణంలోని నేలపై తవ్విన కందకంలోనే నైవేద్యం వండారు. అనంతరం పూర్వీకులకు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. తరతరాలుగా ఈ పండుగను జరుపుకుంటూ వస్తున్నట్లు తండావాసులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు వెంకన్న, సుక్యా, మంజ్యా, వీరన్న, పూజ్యా, లచ్చిరాం, బాలా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కారోబార్ మృతి



నర్సయ్య (ఫైల్)

కొత్తగూడ: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పొగుళ్లపల్లిలో జరిగింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల రోజుల క్రితం దొంగతనం చేశాడనే నెపంతో పొగుళ్లపల్లి వ్యాపారస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దళిత యువకున్ని చితకబాదిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం తీసినందుకు గాను కారోబార్‌గా పని చేస్తున్న గుగ్గిల్ల నర్సయ్య(40)పై కేసు కావడంతో పాటు కారోబార్ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో నాలుగు రోజుల క్రితం తన ఉద్యోగం పోవడమే కాకుండా కేసుల పాలు అయ్యానని అందుకు కారణం అయిన వ్యాపారులను పంచాయతీ పెద్దల వద్దకు పిలిపించి పరిహారం ఇవ్వాలని నర్సయ్య కోరాడు. కేసు పూర్తి అయ్యే వరకు పరిహారం ఇప్పించలేమని పెద్దలు తీర్పు ఇస్తారు. దీంతో మనస్తానికి గురైన నర్సయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన గ్రామస్తులు నర్సయ్యను ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈవిషయమై గూడూరు సీఐ బాబూరావు వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

కురవి: సమస్యలపై పోరాడే ప్రజాగొంతుక బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నేరడ గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డి, రవినాయక్, అనిల్, సందీప్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇరువర్గాలపై కేసు నమోదు

కురవి: మండలంలోని నారాయణపురం శివారు కంచర్లగూడెం సమీపంలోని తేజావత్ తండాలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేయడం జరిగిందని కురవి ఎస్సై బి.గోపి సోమవారం తెలిపారు. సోమవారం సాక్షిలో 'గుడి స్థలం కోసం గొడవ' అనే కథనం ప్రచురితమైన సంగతి విధితమే. ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన తేజావత్ ప్రమోద్, తేజావత్ ఉమ్లు, తేజావత్ రాందాస్, తేజావత్ రమేష్, తేజావత్ సురేష్, తేఆజవత్ సతీష్, తేజావత్ తావుర్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతికి కారకుడైన ఒకరిపై కేసు నమోదు

గార్ల: బైక్‌తో ఢీకొట్టి ఇస్లావత్ అశోక్ మృతికి కారకుడైన భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వీరారెడ్డి సోమవారం తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని బుద్దారం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గార్ల నుంచి బైక్‌పై వెళ్తున్న ఇస్లావత్ అశోక్‌ను, ఇల్లెందు మండలం కొమరారం గ్రామానికి చెందిన భాస్కర్ బైక్‌తో ఢీకొట్టడంతో అశోక్ తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. క్షతగాత్రుడిని గార్ల సీహెచ్‌సీకి తరలించగా మృతిచెందాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

పోరాటంతోనే సౌకర్యాల ఏర్పాటు

కేసముద్రం: సీపీఐ నిర్వహించిన పోరాటంతోనే మండలంలోని అమీనాపురం గ్రామంలోని ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు సోమవారం అధికారులు సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: అనేక కారణాలతో మృతి చెందుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ పక్షాన అండగా ఉంటామని పాలకుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంఠాయాపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మహిళా నాయకురాలు డొనక కొమురమ్మ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గార్ల: మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో రెండురోజుల క్రితం జరిగిన దాడిలో కాళ్లు చేతులు విరిగి తీవ్రగాయాలై మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిట్టల సైదులు, తండ్రి ఉప్పలయ్యలను సోమవారం మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం చేశారు.

మతి స్థిమితం లేని మహిళను ఇంటికి చేర్చిన పోలీసులు

నర్సింహులపేట: మతిస్థిమితం లేకుండా రెండు రోజులుగా మండల కేంద్రంలో తిరుగుతున్న మహిళను గుర్తించి నర్సింహులపేట పోలీసులు ఇంటికి చేర్చారు. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారానికి చెందిన మామిడాల భారతి అనే మహిళ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లింది. పోలీసులు ఆమెను గుర్తించి సోమవారం బయ్యారంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ మినీ బస్సులు ఆపాలి

గార్ల: మండలంలోని సత్యనారాయణపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ మినీ బస్సులు నిలుపుదల చేయాలని న్యూడెమోక్రసీ మండల నాయకుడు ఎండి షర్ఫుద్దీన్ సోమవారం డిమాండ్ చేశాడు.

యూనిఫాం క్లాత్ పంపిణీ

డోర్నకల్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థుల యూనిఫాం క్లాత్ పంపిణీ చేశారు. యూనిఫాం కుట్టించే బాధ్యతను వారికే అప్పగించారు. పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఐకేపీ సీసీల సమక్షంలో మహిళా సంఘాలకు పంపిణీ చేశారు.

బయ్యారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం క్లాత్‌ను ఐకేపీ ఏపీఎం నర్సింహారావు టైలర్లకు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది రవి, మోహన్, బాబు, రమేష్ పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామార్చన

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి రెండో రోజు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం భక్తి శ్రద్ధలతో చేశారు. ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు, ఆస్థాన ఆచార్యులు వేదాంతం వరదరాజాచార్యులు, యాజ్ఞికులు నంద్యాల అనంత శేషరాజన్ బృందం వేద పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు. లక్ష్మీనారాయణ సేవా సమితి ప్రతినిధులు మేరుగు నరేష్, పుల్లూరు భాస్కర్, చిక్కుల నరేష్, బాష బోయిన ఐలయ్య, ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాం సుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, భక్తులు పాల్గొన్నారు.

మండల పరిషత్ అటెండర్ మృతి

బయ్యారం: మండలపరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కె.అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. బయ్యారంలో నివాసం ఉంటున్న అంజమ్మ మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా సేవలు అందించాడు. ఎంపీడీఓ శ్రీనివాసరావు తో పాటు కార్యాలయ సిబ్బంది సోమవారం అంజమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మైనర్‌కు వివాహం.. కేసు నమోదు

నెల్లికుదురు: ఓ మైనర్‌కు చేస్తున్న వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని రత్తిరాం తండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రత్తిరాం తండాలో ఓ మైనర్‌కు ఈ నెల 17న వివాహం చేశారని ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందిందన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మల్లీశ్వరి అంగన్‌వాడీ టీచర్లు, చైల్డ్‌హెల్ప్‌లైన్‌తో కలసి తండాకు వెళ్లి పరిశీలించగా మైనర్‌కు అదే తండాలోని గుడిలో వివాహం చేసినట్లు తెలిసిందన్నారు. మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కేసముద్రం/నెల్లికుదురు: మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, నాయకులు రవీందర్‌గౌడ్, రాహుల్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

గుర్తూరులో గంగమ్మ జాతర



తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో గంగపుత్ర కులస్తులంతా కలసి గంగమ్మ తల్లి జాతరను సోమవారం కనులపండుగగా నిర్వహించారు. ప్రధానంగా గంగపుత్ర కులస్తుల్లో పురుషులు జల బిందెలు, మహిళలు మంగళహారతులతో డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ గంగమ్మ తల్లి దేవాలయం వద్దకు వెళ్లి గంగమ్మ తల్లి విగ్రహాలను జలాలతో శుద్ధి చేసి, మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ, గంగపుత్ర సంఘం నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.